ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి. ఫోన్ : 7780470374

TELTEL/2022/83842

PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

శనివారం 04, ఏప్రిల్ 2026 | వరంగల్ | సంపుటి :04 | సంచిక :201 | పేజీలు :4 | వెల. 3/-

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు..

- ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల వద్ద నగదు, డాక్యుమెంట్లు స్వాధీనం


03


04

## బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం

- మాజీ మంత్రి హరీష్ రావు

బీసీలకు వేల కోట్ల బడ్జెట్ ఇస్తామని కేవలం రూ. 7 కోట్ల మాత్రమే నిధులు ఖర్చు చేసినట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. శాసన సభలో రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీసినట్టు వెల్లడించారు. యాదవులకు గొర్లు ఇస్తామని, నగదు బదిలీ పథకం అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని తెలిపారు. కనీసం మంత్రి వర్గంలో అవకాశం కల్పించలేదని చెప్పారు.దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించాలని శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్ కేసీఆర్‌ను కోరితే వెంటనే అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు.



# నిలదీతలు.. నిరసనలు

- మంత్రులు, ఎమ్మెల్యేలను నిలదీసిన ప్రజలు
- హామీల అమలు, అభివృద్ధిపై ప్రశ్నల వర్షం
- గ్రామసభ, వార్డు సభల్లో ఘటనలు
- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత

2

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం క్షేత్రస్థాయిలో అధికార పార్టీ నేతలకు అగ్నిపరీక్షగా మారుతోంది. గ్రామసభలు, వార్డు సభల వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల నుంచి ఊహించని రీతిలో నిరసన సెగలు తగులుతున్నాయి. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా.. ఎన్నికల వేళ ఇచ్చిన 'ఆరు గ్యారెంటీలు', ఇతర ప్రధాన హామీల అమలులో జాప్యం జరుగుతోందన్న అసంతృప్తి జనాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సభల్లో మంత్రులు, ఎమ్మెల్యేలకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. అభివృద్ధి పనుల సంగతి దేవుడెరుగు.. కనీసం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలు ఎందుకు అందడం లేదని సామాన్య ప్రజలు, రైతులు ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నారు. అధికారులు, నాయకులు సమాధానం చెప్పలేక నీళ్లు నమలడం లేదా పోలీసుల సాయంతో నిరసనకారులను అడ్డుకోవడం వంటి సంఘటనలు క్షేత్రస్థాయిలో ఉన్న వ్యతిరేకతకు అద్దం పడుతున్నాయి. గ్రామసభల్లో ప్రజల ప్రశ్నల వర్షం, ప్రతిపక్షాల ఆందోళనలు, పోలీసుల ముందస్తు అరెస్టుల మధ్య 'ప్రజా పాలన' కార్యక్రమం గందరగోళంగా సాగుతోంది. ప్రభుత్వ ప్రగతిని చాటిచెప్పాల్సిన వేదికలు కాస్తా.. వైఫల్యాలను ఎండగట్టే నిరసన గళాలుగా మారుతుండటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

- ప్రభాత గమనం, మహబూబాబాద్

## ప్రియుడితో కలిసి తల్లిని చంపిన కుమార్తె..

జవహర్ నగర్ మర్డర్ కేసులో షాకింగ్ నిజాలు

జవహర్ నగర్ లో జరిగిన అంజు హత్య కేసుకు సంబంధించి డీసీపీ శ్రీధర్ షాకింగ్ విషయాలను వెల్లడించారు.


3

నాలుగు నెలల పాటు ఎలాంటి క్లూ దొరకని ఈ కేసులో చివరికి సంచలన నిజాలు బయటపట్టారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం, అంజు చిన్న కుమార్తె.. తన ప్రియుడు మాంటి రాజ్ తో కలిసి ఈ హత్యకు పాల్పడింది. ప్రేమ వివాహానికి తల్లి అంగీకరించకపోవడంతో కక్ష పెంచుకున్న ఇద్దరూ హత్యకు ప్లాన్ వేశారు. జాబ్ నుంచి ఇంటికి వచ్చిన అంజును ఇంట్లోనే బంధించి, కత్తితో దాడి చేశాడు మాంటి రాజ్. అనంతరం ఇద్దరూ కలిసి గొంతు కోసి అంజును హత్య చేశారు.

## ఆ ఇళ్లను కొత్త వారికి ఇస్తాం

: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

శాసనసభ సమావేశాల్లో గృహ నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష చేపట్టి, పెండింగ్ లో ఉన్న పనులను పూర్తి చేయడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి గుర్తుచేశారు.

04



శనివారం
04.04.2026
www.prabhatagamanam.com
PRABHATA GAMANAM ప్రభాత గమనం తెలుగు దినపత్రిక



# నిలదీతలు.. నిరసనలు

- మంత్రులు, ఎమ్మెల్యేలను నిలదీసిన ప్రజలు
- హామీల అమలు, అభివృద్ధిపై ప్రశ్నల వర్షం
- గ్రామసభ, వార్డు సభల్లో ఘటనలు
- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత

ప్రభాతగమనం, మహబూబాబాద్: 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత స్పష్టమవుతున్నది. గ్రామసభలు, వార్డు సభలు, డివిజన్ సభలకు హాజరవుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రజలు నిలదీస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల సంగతి ఏమైందని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు అవుతున్నా అభివృద్ధి పనులు చేపట్టడం లేదని నిరసన వ్యక్తం చేశారు. 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు, వార్డు సభలు, డివిజన్ సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఈ సభలకు హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం ఇదే పరిస్థితి నెలకొన్నది. ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, రోడ్లు, మౌలిక సదుపాయాలపై ప్రజలు ఎక్కడికక్కడ మంత్రులు, ఎమ్మెల్యేలను నిలదీశారు. దేవాదాయ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డిని సభల్లో ప్రజలు నిలదీశారు. అభివృద్ధి పనులను ఎందుకు చేయడంలేదని అడిగారు. స్థానిక సమస్యలు వినకుండానే వెళ్లిపోతున్న మంత్రులు, ఎమ్మెల్యేలను అడ్డుకున్నారు. ప్రజా సమస్యలు విననప్పుడు డివిజన్ సభలు, వార్డు సభలు, గ్రామ సభలు ఎందుకని ప్రశ్నించారు. ప్రజల నిలదీతలతో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కంగుతిన్నారు.

## రుణమాఫీ ఎక్కడైంది?

ప్రభుత్వ విప్ రాంచంద్రూనాయక్‌ను నిలదీసిన రైతులు

దంతాలపల్లి : దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామసభలో పాల్గొన్న డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రూనాయక్‌ను రైతులు నిలదీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే వివరిస్తుండగా.. పలువురు రైతులు లేచి రుణమాఫీ ఎక్కడైంది..? రైతు బంధు ఏది...? అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఏవి? అని ఎమ్మెల్యేను నిలదీయడంతో పోలీసులు వారికి నచ్చజెప్పి కూర్చోబెట్టారు.

## సంక్షేమ పథకాలు ఎప్పుడు అమలు చేస్తరు?

ఎమ్మెల్యే కడియంను నిలదీసిన పాంనూరు గ్రామస్తులు

స్టేషన్‌ఘన్‌పూర్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత నిర్వహించిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా జరిగిన గ్రామ సభల్లో సంక్షేమ పథకాల అమలుపై స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, అధికారులను ప్రజలు నిలదీశారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పాంనూర్ గ్రామంలో సర్పంచ్ సంపత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడుతుండగా పలువురు అడ్డు తగిలారు. తనకు ఇందిరమ్మ ఇల్లు ఎందుకు ఇవ్వలేదు? మేం ఓటు వేయలేదా? అని కలకోట యాదమ్మ ప్రశ్నించింది. బంజరు కాల్వలో చెట్లు తొలగించి, సీసీ లైనింగ్, పరెె కాల్వ పనులు చేయించాకే పాంనూర్‌లో అడుగుపెడతానని గతంలో హామీ ఇచ్చారని, ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు ఎందుకు చేపట్టలేదని జాలిగపు రాజు అనే రైతు, బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి ఒగ్గు రాజు శ్రీహరిని ప్రశ్నించారు. అలాగే పాంనూర్ నుంచి నమిలిగొండ వరకు కంకర పోసి మూడేళ్లు గడుస్తున్నా బీటీ వేయకపోవడం తో రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందిపడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. పాంనూర్‌లో ప్లాస్టిక్ రీ సైక్లింగ్ యార్డును ఏర్పాటు చేయొద్దని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

## రైతు భరోసా.. ఇస్తరా? ఎగ్గొడతరా?

లింగాలఘనపురం : జనగామ జిల్లా లింగాలఘనపురంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పలు సమస్యలపై గ్రామస్తులు అధికారులను నిలదీయగా, సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. సర్పంచ్ ఎడ్ల లావణ్యారాజు అధ్యక్షతన గ్రామసభ ప్రారంభం కాగానే ప్రజలు అడ్డుకున్నారు. ఆరు గ్యారెంటీలపై అధికారులను నిలదీశారు. రైతు భరోసా ఎకరం లోపు ఉన్న వారికే వేశారని, అదీ ఒకటే విడత ఇచ్చారని, వాస్తవానికి రైతులకు 5 విడతలుగా నిధులు జమ కావాల్సి ఉందని ఏదునూరి వీరన్న, కేమిడి వెంకటేశ్, గట్టగల్ల శ్రీహరి,బెజ్జం చంద్రయ్య, కేలపు లక్ష్మీనారాయణ, పుల్కరం ఉప్పలయ్య, పోరెడ్డి ఎల్లారెడ్డి, శోభ నిలదీశారు. అసలు రైతు భరోసా వేస్తరా..? ఎగ్గొడతరా? పింఛన్ల పెంపు ఏమైంది?, తులం బంగారం పథకం ఎక్కడికి పోయింది? స్కూటీలు ఏమయ్యాయి? మహిళలకు రూ.2500 ఎక్కడ? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఏ ఒక్క పథకం అమలు చేయకుండా ప్రగతి గ్రామసభ ఎందుకు.. బహిష్కరించాలని సర్పంచ్ ఎడ్ల లావణ్యారాజుపై ఒత్తిడి తీసుకొచ్చారు. గ్రామసభ గందరగోళంగా సాగింది.

## మల్లూర్ లో బీఆర్ఎస్ నాయకుడి అరెస్టు

మల్లూర్ : మల్లూర్ మండలం అన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన బానోత్ రాజునాయక్(ఢిల్లీ రాజు) కొయ్యూర్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్‌సాన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు బయలుదేరే సమయంలో కొయ్యూర్ పోలీసులు వచ్చి తనను బలవంతంగా ఇంట్లో నుంచి లాక్కొని అన్‌సాన్‌పల్లి గ్రామం నుంచి భూపాలపల్లి పట్టణం వైపు పోలీస్ వాహనంలో తీసుకెళ్లినట్లు తెలిపారు. మూడు గంటలపాటు కాలయాపన చేసి, గ్రామసభ పూర్తయింది.. ఇక నీవు నీ పనులు చేసుకో అంటూ విడిచిపెట్టినట్లు వాపోయాడు.

## ఏడాది గడిచినా పంట నష్టమేదీ?

ఏటూరునాగారం : ఏటూరునాగారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ శ్రీలత అధ్యక్షతన నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రిలక్ష్మీ నర్సింహారావు రైతుల పక్షాన ధ్వజమెత్తారు. గతేడాది రబీ సీజన్‌లో ప్రకృతి వైపరీత్యానికి రైతులకు జరిగిన నష్టంపై ప్రభుత్వం ఎకరాకు ప్రకటించి రూ.10వేలు నేటికీ అందడం లేదని, రైతు భరోసా కూడా సకాలంలో పడడం లేదన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతులకు రూ.10 వేలు చొప్పున రైతుబంధు ఇచ్చారని అన్నారు. రైతులు కష్టాల్లో ఉన్నందున వెంటనే ఇచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఉప్పుగల్లులో బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్

జఫర్‌గఢ్ : జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్లులో జరిగే గ్రామసభకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి వస్తున్నారనే సమాచారంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నాయిని నరేశ్‌గౌడ్, మండల జాయింట్ సెక్రటరీ పులి ధనుంజయ్, మండల నాయకుడు గోలి అన్నారెడ్డి అదుపులోకి తీసుకున్నారు.

---

# నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రభాత గమనం, హైదరాబాద్ : రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం ఎనగల్, లింగంపేట గ్రామాల్లో నూతన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతును రాజుగా చేయాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వ్యవసాయరంగాన్ని బలోపేతం చేయడంలో విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రైతులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉచిత విద్యుత్ అందించేందుకు తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం ఇప్పటికీ కొనసాగుతుండటం రైతు సంక్షేమానికి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఆ పథకం వల్ల చిన్న, సన్నకారు రైతులు ఎంతో లాభపడుతున్నారన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో లోవోల్టేజ్



సమస్యలను పూర్తిగా నివారించి, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో నూతన సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. రైతులు సాగునీటి కోసం విద్యుత్‌పై ఆధారపడుతున్న నేపథ్యంలో, పంటల సమయంలో ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామాలకు దూరంగా ఉన్న ఇళ్లకు కూడా సౌకర్యవంతంగా విద్యుత్ మీటర్లను అందించే విధానాన్ని అమలు చేస్తున్నామని, పంచాయతీ కార్యదర్శి అనుమతితో మీటర్ మంజూరు చేసే ప్రక్రియను సరళీకృతం చేసినట్లు చెప్పారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలో విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 10నూతన, రాజన్న ఆలయానికి ప్రత్యేక సబ్‌స్టేషన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అదనంగా రుద్రంగి వద్ద 132 కేవీ, కథలాపూర్‌లో 220 కేవీ హై కెపాసిటీ సబ్ స్టేషన్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గంలో 14 సబ్ స్టేషన్ల అభివృద్ధికి ఆమోదం లభించిందని తెలిపారు. గత పాలకులు పదేళ్ల కాలంలో ఒక్క సబ్ స్టేషన్ కూడా మంజూరు చేయలేకపోయారని ఆరోపించారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ రంగంలో విస్తృత మార్పులు తీసుకువస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అశినపర్తి శోభరాణి-సుధాకర్, కొక్కుల నరేష్, కరీంనగర్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమేష్, వేములవాడ డివిజన్ ఇంజనీర్ వెంకటరమణ, ఎంఆర్టీ డివిజనల్ ఇంజనీర్ చంద్రమౌళి, రాజం, మాజీ జడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్ పాల్గొన్నారు.

# 7న 'బస్ భవన్ బచావో'

## : పిలుపునిచ్చిన ఆర్టీసీ జేఏసీ

ప్రభాతగమనం, హైదరాబాద్ : ప్రభుత్వం బస్ భవన్‌లోని 'బీ-బ్లాక్' కార్యాలయాన్ని జీవీస్సీ, ఐటీ శాఖలకు కేటాయించడాన్ని నిరసిస్తూ ఈనెల 7న 'బస్ భవన్ బచావో' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న తెలిపారు.ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## వాణిజ్యశాఖకు 7,097 కోట్ల ఆదాయం

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.7,097.38 కోట్లు ఆదాయం సమకూరినట్టు రవాణా శాఖ తెలిపింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. గతేడాదితో పోలిస్తే వృద్ధి రేటు 2.07% ఉన్నదని, 83.16% ఆదాయ లక్ష్యాన్ని సాధించినట్టు తెలిపింది.

# ప్రియుడితో కలిసి తల్లిని చంపిన కుమార్తె..

## జవహర్ నగర్ మర్డర్ కేసులో షాకింగ్ నిజాలు

ప్రభాత గమనం, మల్కాజ్‌గిరి: జవహర్ నగర్‌లో జరిగిన అంజు హత్య కేసుకు సంబంధించి డీసీపీ శ్రీధర్ షాకింగ్ విషయాలను వెల్లడించారు. నాలుగు నెలల పాటు ఎలాంటి క్లూ దొరకని ఈ కేసులో చివరికి సంచలన నిజాలు బయటపట్టారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం, అంజు చిన్న కుమార్తె.. తన ప్రియుడు మాంటి రాజ్‌తో కలిసి ఈ హత్యకు పాల్పడింది. ప్రేమ వివాహానికి తల్లి అంగీకరించకపోవడంతో కక్ష పెంచుకున్న ఇద్దరూ హత్యకు ప్లాన్ వేశారు. జాబ్ నుంచి ఇంటికి వచ్చిన అంజును ఇంట్లోనే బంధించి, కత్తితో దాడి చేశాడు మాంటి రాజ్. అనంతరం ఇద్దరూ కలిసి గొంతు కోసి అంజును హత్య చేశారు. హత్య అనంతరం అదే ఇంట్లో బెడ్‌రూమ్‌లో బెడ్ కింద మృతదేహాన్ని పూడ్చి పెట్టారు. పెద్ద కూతురికి అనుమానం రాకుండా గది



మొత్తం స్ప్రేలు చల్లి దాచిపెట్టారు. ఇక, ఈ ఘటనలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. మాంటి రాజ్‌పై ఇప్పటికే రెండు పోక్సో కేసులు ఉన్నాయని డీసీపీ తెలిపారు. గతంలో అంజు తన చిన్న కూతురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఆ కేసులో అతను 50 రోజులు జైలు శిక్ష కూడా అనుభవించాడు. ఇదిలా ఉంటే, తల్లిని హత్య చేసిన అనంతరం, అమ్మ చిట్టీ డబ్బుల కోసం ఇద్దరూ కలిసి చిట్టీ వేసే వ్యక్తిని అడిగారు.. అయితే, చిట్టీ నిర్వాహకుడు పోలీస్ FIR ఉంటేనే చిట్టీ డబ్బులు ఇస్తామని చెప్పాడు. దీంతో ఆ డబ్బుల కోసం పోలీసులకు పిర్యాదు చేశారు. అప్పటికే చిన్న కూతురు తల్లి వేరే వ్యక్తితో వెళ్ళిపోయింది అని నమ్మించిందని తెలిసింది. అంజును మే 12న హత్య చేసినట్లు విచారణలో తేలింది. అక్టోబర్‌లో పెద్ద కూతురు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు మళ్లీ తెరపైకి వచ్చింది. అంజుకు చెందిన జూపిటర్ స్కూటీని చిన్న కూతురు, ఆమె ప్రియుడు కలిసి విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ స్కూటీని త్వరలో స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం నిందితుడు మాంటి కుమార్ సింగ్ అలియాస్ మాంటి రాజ్‌ను రిమాండ్‌కు తరలించగా, చిన్న కూతురు మైనర్ కావడంతో ఆమెను జువైనల్ హోమ్‌కు పంపించారు. పోలీసులు మరిన్ని ఆధారాలు సేకరిస్తున్నారు.



# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు..

- ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల వద్ద నగదు, డాక్యుమెంట్లు స్వాధీనం

ప్రభాత గమనం, వరంగల్ : వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నగదు, డాక్యుమెంట్లు ఇద్దరు సబ్ రిజిస్ట్రర్ల నుంచి స్వాదీనం చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రర్-1 జమాలపురం రామనరసింహరావు, సబ్ రిజిస్ట్రర్-2 దేవులూరి ఆనంద్ ఫోన్లను స్వాధీనం చేసుకుని పరిశీలించారు.ఇద్దరు అధికారులు డాక్యుమెంట్ రైటర్లతో జరిపిన ఫోన్ పే పరిశీలించగా సుమారు రూ.42 లక్షలు లావాదేవీలు జరిపినట్లు గుర్తించారు. వీరి వద్ద నుంచి 70 రిజిస్ట్రేషన్ కాని డాక్యుమెంట్లను పరివీలించారు. అదే విధంగా ఇద్దరు ఇళ్ల నుంచి రూ.24.61 లక్షల నగదును, 819.500 గ్రాముల బంగారు ఆభరణాలను, 2.600 కిలో గ్రాముల వెండి ఆభరణాలను, రూ.30 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు గుర్తించి ప్రభుత్వానికి పంపనున్నట్లు వెల్లడించారు.



# సర్పంచ్ కుటుంబంపై పెట్రోల్ తో దాడి

## కుటుంబ సభ్యుల పరిస్థితి విషమం

ప్రభాత గమనం, వికారాబాద్ : వికారాబాద్ జిల్లా పరిగి మండలంలోని రూప్‌సింగ్ తాండాలో దారుణ ఘటన వెలుగుచూసింది. ఆస్తి తగాదాలు, డబ్బుపై వ్యామోహం కన్న తండ్రిని, కుటుంబ సభ్యులను సజీవ దహనం చేసే స్థాయికి తీసుకెళ్లాయి. స్థానిక సర్పంచ్ రమణి భాయ్ కుటుంబంపై జరిగిన ఈ హత్యాయత్నం జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై పరిగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### నిద్రలో ఉండగా పెట్రోల్ తో దాడి..

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సర్పంచ్ రమణి భాయ్ కుటుంబం ఈరోజు(మంగళవారం) తెల్లవారుజామున అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఈ ఘాతుకం జరిగింది. నిందితుడు అనార్ సింగ్ అత్యంత కిరాతకంగా పథకం రచించాడు. కుటుంబ సభ్యులు ఎవరూ బయటకు రాకుండా ఇంటి ప్రధాన తలుపుకు బయట నుంచి తాళం వేశాడు. ఇంటి పైకప్పుకున్న రంధ్రం (గవాసు) ద్వారా లోపలికి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మంటల్లో చిక్కుకున్న సర్పంచ్ రమణి భాయ్, ఆమె భర్త హన్మంత్ నాయక్, కుమారుడు వెంకటేశ్ తీవ్రంగా గాయపడ్డారు. మరో కుమారుడు




శివకు స్వల్ప గాయాలయ్యాయి.

### దాడికి గల కారణాలు..

ఈ దారుణానికి ప్రధాన కారణం కుటుంబ కలహాలు, ఆర్థిక వివాదాలని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. హన్మంత్ నాయక్‌కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య నాతిభాయ్ ఇటీవల మరణించారు. సర్పంచ్ రమణి భాయ్ రెండవ భార్య. మరణించిన నాతిభాయ్ పేరిట రూ.5 లక్షల రైతుబీమా మంజూరైంది. ఈ డబ్బుతో పాటు ఆస్తిలో వాటా కావాలని నాతిభాయ్ కుమారుడైన అనార్ సింగ్ తండ్రితో తరచూ గొడవ పడేవాడు. తండ్రి హన్మంత్ నాయక్ తన డిమాండ్లను పట్టించుకోకపోవడంతో కక్ష పెంచుకున్న అనార్ సింగ్, అడ్డుగా ఉన్న మొత్తం కుటుంబాన్ని అంతం చేయాలని నిర్ణయించుకున్నాడు.

# పోరాటస్ఫూర్తికి ప్రతీక దొడ్డి కొమురయ్య

## అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



ప్రభాత గమనం. సిరిసిల్ల : పోరాట స్ఫూర్తికి ప్రతీక దొడ్డి కొమురయ్య అని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి అదనపు కలెక్టర్ పూలమాలలు వేసి నివా ళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య పోరాటస్ఫూర్తిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షే మ శాఖ జిల్లా అధికారి సౌజన్య, ఉద్యానవన శాఖ అధికారి శరత్, ఎగుట్ల కనుకయ్య, నాగం కుమార్, చిమల్ల మల్లేశం, స్తంబ లచ్చయ్య, వేముల నాగరాజు, అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల దుర్మరణం

## వేర్వేరు గ్రామాలు అయినప్పటికీ మిత్రులు

ప్రభాత గమనం, ఎలమంచిలి : వారు ముగ్గురూ స్నేహితులు. వేర్వేరు గ్రామాలు అయినప్పటికీ పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఒకరి గ్రామంలో జరిగిన అమ్మవారి జాతరకు మిగిలిన ఇద్దరూ హాజరయ్యారు. ఉత్సాహంగా గడిపిన తరువాత ఒకరిని అతని ఊరులో దిగబెట్టడానికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. జాతీయ రహదారిపై యూ టర్న్ తీసుకుంటుండగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొన్నది. దీంతో తీవ్రంగా గాయపడిన ముగ్గురూ ఆస్పత్రికి తరలిస్తుండగా నిమిషాల వ్యవధిలోనే ప్రాణాలు కోల్పోయారు. మరణంలోనూ స్నేహ బంధాన్ని వీడలేదు. ఎలమంచిలి మండలం



బంగారు నానీ (ఫైల్ ఫొటో) | ఎలపా గోవింద్ (ఫైల్ ఫొటో) | బంగారు దుర్గాప్రసాద్ (ఫైల్ ఫొటో)

పోతిరెడ్డిపాలెం హైవే జంక్షన్ వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘోర ప్రమాదానికి సంబంధించి రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపిన వివరాలిలా వున్నాయి. ఎలమంచిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన బంగారు నానీ (24), ఏటికొప్పాక గ్రామానికి చెందిన ఎలపా గోవింద్ (25), పోతిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బంగారు దుర్గా ప్రసాద్ (16) స్నేహితులు. చుట్టుపక్కల గ్రామాల్లో పెయింటింగ్ పనులు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో గురువారం పురుషోత్తపురంలో గ్రామ దేవత గొల్లమ్మ తల్లి జాతర జరిగింది.ఎలపా గోవింద్ అత్తవారిది ఇదే ఊరుకావడంతో అతను ఇక్కడికి వచ్చాడు. బంగారు నాని ఆహ్వానం మేరకు దుర్గాప్రసాద్ కూడా పురుషోత్తపురం వచ్చాడు. ముగ్గురూ కలిసి జాతరలో ఉత్సాహంగా గడిపారు. అర్ధరాత్రి 11.40 గంటల సమయంలో దుర్గా ప్రసాద్‌ను అతని ఇంటి వద్ద దించేందుకు ముగ్గురూ కలిసి పల్సర్ బైక్‌పై పోతిరెడ్డిపాలెం బయలుదేరారు. తుని వైపు నుంచి అనకాపల్లి వైపు వెళ్లే మార్గంలో ప్రయాణిస్తున్న వీరు సుమారు ఐదు నిమిషాల తరువాత పోతిరెడ్డిపాలెం జంక్షన్ వద్ద యూ టర్న్ తీసుకుంటున్నారు. ఇదే సమయంలో అనకాపల్లి వైపు నుంచి తుని వైపు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొన్నది. దీంతో బైక్‌పై వున్న ముగ్గురూ ఎగిరి రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయి, తీవ్రంగా గాయపడ్డారు. బంగారు నానీని 108 అంబులెన్స్‌లో, మిగిలిన ఇద్దరిని హైవే పెట్రోలింగ్ అంబులెన్స్‌లో ఎక్కించి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి బయలుదేరారు. కొద్దిదూరం వెళ్లేసరికి నానీ మృతిచెందడంతో అంబులెన్స్‌ను ఎలమంచిలి సీహెచ్‌సీకీ మళ్లించి, మృతదేహాన్ని మార్చురీలో పెట్టారు. అనకాపల్లి తరలిస్తున్న మిగిలిన ఇద్దరిలో ఎలపా గోవింద్ దారిలోనే ప్రాణాలు వదిలాడు. దుర్గాప్రసాద్ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాలకు శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎలమంచిలి, అనకాపల్లి మార్చురీల వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో విషాద వాతావరణం నెలకొంది.

శనివారం
04.04.2026
www.prabhatagamanam.com

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

# బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం

**: మాజీ మంత్రి హరీష్ రావు**



ప్రభాత గమనం, మహబూబ్ నగర్ : బీసీలకు కురుమ, గొల్ల, కురుమలకు రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలో కొమురయ్య విగ్రహా నికి మాజీ మంత్రులు హరీష్ రావు, శ్రీనివాస్ గౌడ్ , లక్ష్మారెడ్డి , ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తదితరులు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ బీసీలకు వేల కోట్ల బడ్జెట్ ఇస్తామని కేవలం రూ. 7 కోట్ల మాత్రమే నిధులు ఖర్చు చేసినట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. శాసన సభలో రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీ సినట్టు వెల్లడించారు. యాదవులకు గోర్లు ఇస్తామని, నగదు బదిలీ పథకం అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని తెలిపారు. కనీసం మంత్రి వర్గంలో అవకాశం కల్పించలేదని చెప్పారు.దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి కార్య క్రమాలు అధికారికంగా నిర్వహించాలని శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్ కేసీఆర్‌ను కోరితే వెంటనే అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ పచ్చబడాలని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు హరీష్ రావు అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. గతం లో 14 రోజులకు ఒకసారి నీళ్లు రాగా బీఆర్ఎస్ హయాంలో ప్రతి రోజు నీళ్లు ఇచ్చామని వివరించారు. రోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేమని, సాగు నీరు అందించేందుకు పూర్తి ప్రయత్నాలు చేసామని తెలిపారు. పాలమూరు ప్రాజెక్ట్ 90 శాతం పూర్తి చేశామని వెల్లడించారు. రాజకీయంగా బీసీలకు సమాన అవకాశాలు కల్పిం చాలని, బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ లు ఇస్తామని మోసం చేశారని తెలిపారు .విద్య,ఉద్యో గాల్లో కూడా రిసర్వేషన్ ఇవ్వడం లేదని ఆరోపిం చారు.



## విద్యుత్ ఆర్టిజన్ల వంటావార్పు

ప్రభాత గమనం, హైదరాబాద్: ఉమ్మడి జిల్లాలోని విద్యుత్ కార్యాలయాల ఎదుట గురువారం ఆర్టిజన్లు వంటావార్పు చేశారు. ఆర్టిజన్, అన్‌మ్యాన్డ్ కార్మికుల కన్వర్షన్, ఎగ్జిస్టింగ్ సర్వీస్ రూల్స్ అమలుకు టీవీఏఈ జే ఏసీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన సమ్మె కార్యాచరణలో భాగంగా ధర్నా నిర్వహిం చారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రా ణాలకు తెగించి సంస్థ కోసం పనిచేస్తున్న కార్మికు లు కన్వర్షన్ సాధించడానికి అర్హులన్నారు. యాజమాన్యం సమస్యలు పరిషరించకపోతే ఈ నెల 7న ఎస్పీడీసీఎల్ ఆఫీస్ వద్ద చేపట్టే మహాధర్నా ను కార్మికులు విజయవంతం చేయడంతో పాటు 8 నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆందో ళనకు టీఆర్వీకేఎస్, తెలంగాణ ఇంజినీర్స్ అసోసియేషన్, పవర్ డిప్లొమా అసోసియేషన్ నాయకులు సంఘీభావం తెలిపారు.



## ఆ ఇళ్లను కొత్త వారికి ఇస్తాం

**: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ప్రభాత గమనం, హైదరాబాద్: శాసనసభ సమావేశాల్లో గృహ నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష చేపట్టి, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 21 లక్షల ఇళ్లు నిర్మించారని తెలిపారు. అనంతరం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష ఇళ్లకు అనుమతులు ఇచ్చిందని చెప్పారు. అయితే, ఆ ఇళ్లలో అనేక పనులు పూర్తి కాలేదని మంత్రి వెల్లడించారు. సుమారు 70 వేల ఇళ్లలో చిన్నపాటి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, మరో 26 వేల ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. ఈ అసంపూర్తి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు. ఇక గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్లలో 12 వేల ఇళ్లను ఇప్పటికీ లబ్ధిదారులు ఆక్యూపై చేయలేదని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు మూడు నెలల గడువు ఇచ్చి నోటీసులు జారీ చేయగా, అందులో 6 వేల మంది ఇళ్లను ఆక్యూపై చేసుకున్నారని చెప్పారు. మిగిలిన ఇళ్లను అర్హులైన కొత్త లబ్ధిదారులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అలాగే, పూర్తి కాకుండా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎంత ఖర్చు అయినా పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు.

## మేడారం ఘటనకు మంత్రులదే బాధ్యత

**: రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీష్ రెడ్డి**



ప్రభాత గమనం, ములుగు : మేడారం గద్దెల దగ్గర ప్రమాదానికి ముమ్మాటికి మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ బాధ్యత వహించాలని రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు. హన్మ కొండలోని హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ పొందుతున్న మేడాం పూజారి కుమారుడు యువన్ ను ఆయన పరామర్శించారు.బా లుడి కుటుంబసభ్యులు తమ గోడు చెప్పుకుని కన్నీటి పర్యంతమయ్యారని ఆయన అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో, కాసుల కక్కుర్తితో ప్రమాదం జరిగి పసివాడు కాలును కోల్పోయి, మరో కాలు విరిగిపోయి ఉంటే ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. మంత్రి సీతక్క వచ్చి పరా మర్శించి రూ.10 వేలు చేతిలో పెట్టి చేతులు దులుపుకుని పోవడం దుర్మార్గమన్నారు. వందేళ్లు నిలిచిపోయేలా నిర్మాణాలు చేపడు తున్నామని గప్పాలు చెప్పుకుని, గాలికి ఊడిపోయే నిర్మాణాలు చేపట్టారని ఆరోపిం చారు. కమిషన్లు పంచుకుని, కాసుల కక్కుర్తితో వ్యవహరించిన మంత్రులు బాలుడిని ఆదుకునేందుకు ముందుకు రాకపో వడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ తప్పు ఒప్పుకోవాలని, ఆ పసి వాడిని చూసి మానవత్వంతో వ్యవహరించా లని సూచించారు. బాలుడికి ప్రస్తుతం అయ్యే వైద్య ఖర్చులన్ని ప్రభుత్వమే భరించాలని, హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యాక, అతడి భవిష్యత్ కోసం ప్రభుత్వం కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాలుడి తల్లిదం డ్రులిద్దరు చదువుకున్న వారేనని, వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ప్రతి దానికి సిట్‌లు, సీబీసీఐడీలు అంటున్న రేవంత్ రెడ్డి మేడారం ఘటనపై సిట్ వేసి నాసి రకం పనులకు సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## ఆటోను ఢీకొన్న కారు..

**ఒకరి మృతి**

ప్రభాత గమనం, మహబూబాబాద్ : జిల్లాలోని మరిపెడ మండలం సీతారాం తండా స్టేజ్ వద్ద ఈరోజు(శుక్రవారం) ఉదయం రోడ్డు ప్రమాదం(Road Accident) జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. శుభకార్యానికి ఆటోలో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన ఓ కారు.. ఆటోను బలంగా ఢీకొట్టింది. ప్రమాద సమయంలో ఆటోలో తొమ్మిది మంది ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.



## ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు

ప్రభాత గమనం, హనుమకొండ: తెలంగాణ ఆయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలను శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె. రవి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దొడ్డి కొమురయ్య ఉద్యమ స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో సమానత్వం, సామాజిక న్యాయం సాధనలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి లక్ష్మణ్, 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆసనాల శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బట్టి శ్యాంప్రసాద్ యాదవ్, బీసీ–ఎస్సీ ఉమ్మడి జిల్లా చైర్మన్ ప్రొఫెసర్ చిన్న మల్లయ్య, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సన్యాసి శ్రీనివాస్, గొర్ల కాపరుల సంఘం అధ్యక్షుడు వేల్పుల రమేష్, కురుమ కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచు ప్రభాకర్, దొడ్డి కొమురయ్య కుటుంబ సభ్యులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు తదిత రులు పాల్గొన్నారు.

printed, Published and Owened by PANDULA RAVICHANDER at H.NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABAD, TELANGANA, 506001. Editor. P. Ravichander★Email:www.prabhatagamanam.com ★ RNI NO TELTEL/2022/83842. cell: 7780470374